

నమ్మివానిపేట డంపింగ్ యార్డులో టన్నులు కొద్దీ చెత్తను తగలబెట్టేవారు. ఆ పొగతో సుమారు 25 గ్రామాల ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యేవాళ్లు. చాలా మంది శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందిపడేవాళ్లు. దుర్వాసనతో ముక్కుపుటలు పగిలిపోయేవి. ఇక్కడ నివాస మున్నవాళ్లంతా తీవ్ర ఆపసోపాలు పడే వారు. ఇది గత ప్రభుత్వ పాలనలో పరిస్థితి.

ఇది కదా **అభివృద్ధి**

నమ్మివాని డంపింగ్ యార్డు పచ్చదనంతో కనువిందు చేస్తోంది. టన్నుల కొద్దీ వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక డంపింగ్ యార్డు రూపురేఖలు మారిపోయాయి. ఇప్పుడా ప్రాంతం వివిధ మొక్కలతో పార్కును తలపిస్తోంది. ఇది ప్రస్తుత పరిస్థితి.

నాడు చెత్త మయం నేడు చెట్లతో ఆహ్లాదం

- రూపురేఖలు మారిన నమ్మివానిపేట డంపింగ్‌యార్డు
- పొగ నుంచి విముక్తి
- తొలగిన 25 గ్రామాల ప్రజల అవస్థలు



నమ్మివానిపేటలో డంపింగ్‌యార్డులో పచ్చదనం



చెత్త కుప్పలు లేని డంపింగ్ యార్డు



డంపింగ్‌యార్డులో తరిగిన చెత్త గుట్టలు

నాలుగు వార్డులకు :	21 క్లాప్ వాహనాలు, 2 ట్రాక్టర్లు, 5 మినీ లారీలు
సేకరించే చెత్త :	35 టన్నులు
క్లాప్ వాహనాలకు కేటాయించిన నిధులు	రూ.1.47 కోట్లు
గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ :	రూ.40 లక్షలు (నిర్మాణ దశలో ఉంది)
డంపింగ్ యార్డుకు రెండు గేట్లు ఏర్పాట్లు :	రూ.14 లక్షలు కేటాయింపు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ నమ్మివానిపేట డంపింగ్‌యార్డు ప్రస్తుతం పచ్చదనంతో అలరారుతోంది. భీమిలి జోన్ నుంచి సేకరించిన చెత్తతో డంపింగ్‌యార్డు గత ప్రభుత్వాల హయాంలో గుట్టలుగా పేరుకుపోయేది. ఇందులో నుంచి వెలువడే విషవాయువుల కారణంగా మంటలు చెలరేగి రోజులకొద్దీ వెలువడే పొగతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యేవారు. శ్వాసకోశ వ్యాధులకు గురయ్యేవారు. అగ్నిమాపక శకటాలు రోజుల కొద్దీ ప్రయత్నించినా పొగ, మంటలు అదుపులోకి వచ్చేవి కాదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత డంపింగ్‌యార్డు స్వరూపమే మారిపోయింది. ఇప్పుడు డంపింగ్‌యార్డులో చెత్త గుట్టలకు బదులుగా పచ్చదనం చోటు చేసుకుంది. ప్రహరీ ఎత్తుచేసి పండ్లతోటలు సాగు చేస్తున్నారు.



ఇళ్ల నుంచి తడి,పొడి చెత్త తరలించే క్లాప్ వాహనాలు



డంపింగ్‌యార్డు నుంచి కాపులుప్పాడ జిందాల్ ప్లాంట్‌కు చెత్త తరలింపు

9 ఎకరాలలో వసతులు ఏర్పాటు

నమ్మివానిపేట డంపింగ్‌యార్డుకు ప్రతిరోజూ జోన్‌లోని నాలుగు వార్డుల నుంచి 21 క్లాప్ (క్లీన్ ఏపీ) వాహనాలు, రెండు ట్రాక్టర్లు, అయిదు మినీ లారీల ద్వారా 35 టన్నుల చెత్త చేరుతుంది. క్లాప్ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1.47 కోట్లతో క్లాప్ వాహనాలు సమకూర్చింది. రూ.40 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే క్లోజ్‌డ్ కంపాక్ట్ వాహనాల ద్వారా చెత్తను వీలుగా కాపులుప్పాడ తరలించే అవకాశం ఉంది. దీంతో డంపింగ్‌యార్డులో చెత్త వాసనే ఉండదు. ప్రస్తుతం రోజుకు 30 టన్నుల చెత్తను భారీ వాహనం ద్వారా కాపులుప్పాడలోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించారు. ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు రెండేళ్ల క్రితం ఏడు వాహనాలను వినియోగించడంతో ఇక్కడ చెత్త గుట్టలు కరిగిపోయాయి. రూ.14 లక్షలతో ప్రహరీ ఎత్తుతో పాటు రెండు చోట్ల గేట్లు ఏర్పాటు చేశారు.

ఉక్కిరిబిక్కిరి నుంచి విముక్తి



టీడీపీ ప్రభుత్వ హయాంలో నమ్మివానిపేట డంపింగ్‌యార్డు రోజుల తరబడి తగలబడిపోయి పొగలుకక్కేది. దీంతో చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో 25 గ్రామాల ప్రజలు ఆరోగ్యకరమైన ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం చెత్తను పవర్ ప్లాంట్‌కు తరలించడంతో పొగ నుంచి విముక్తి కలిగింది. -కొయ్య మోహన్‌రెడ్డి, సంతపేట

ఇంటికొచ్చి చెత్త తీసుకెళుతున్నారు



ఇంటింటికి తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరుచేయడానికి మూడు డబ్బాలు ఇచ్చారు. ఇంటికే వచ్చి క్లాప్ వాహనాల ద్వారా చెత్తను తరలిస్తున్నారు. దీంతో దాదాపు వీధులన్నీ శుభ్రంగా ఉంటున్నాయి. గత ప్రభుత్వాలు చెత్త సేకరణను పట్టించుకున్న పాపాన పోలేదు. -బొద్దు నరసింగరావు, కొండపేట

ఉద్యానవనంలా తీర్చిదిద్దారు



డంపింగ్‌యార్డును నందనవనంలా తీర్చిదిద్దడంతో పలువురు ఇక్కడ వనభోజనాలకు వస్తున్నారు. చెత్త ఉన్నప్పుడు ఈ డంపింగ్‌యార్డు పరిసరాలకే రాని జనం ఇప్పుడు చెత్త లేకపోవడంతో వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. – వెంపాడ అప్పలకారు రెడ్డి, చిట్టివలస

ఇబ్బందులు తప్పాయి



నమ్మివానిపేట డంపింగ్‌యార్డును ఇప్పుడు చూస్తే నమ్మబుద్ధి కావడం లేదు. గతంలో చెత్త కుప్పలు పేరుకుపోయిన చాలా ఇబ్బందులు పడేవాళ్లం. దుర్వాసనతో అవస్థలు పడ్డాం. ఇప్పుడు చెత్తకు బదులు పచ్చటి మొక్కలు ఉన్నాయి. ఆహ్లాదకరంగా మారిపోయింది. -చెట్ల శ్రీనివాసరెడ్డి, తగరపువలస

క్లుప్తంగా

నేడు గాండ్ల తెలకుల, దేవతిలకుల పిక్నిక్



సమావేశంలో పాల్గొన్న తెలకుల సంక్షేమ సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని దొరతోట వద్ద ఆదివారం విశాఖ తెలకుల సంక్షేమ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అఖిల గాండ్ల తెలికుల, దేవాతిలకుల కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్లు ఆ సంఘ సభ్యులు తెలిపారు. శనివారం భీమిలి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు పాల్గొన్నారు. ప్రతి ఏడాది పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈసారికూడా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, గేమ్స్, మేజిక్ షోలతోపాటు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇతర ప్రముఖులు పాల్గొంటారని కమిటీ సభ్యులు వీరవల్లి పెదబాబు, గొట్టిపల్లి వెంకటరావు, ఎన్.ఎ.నారాయణరాజు, పోలిపల్లి అప్పలరాజు, కాండూరి కోటేశ్వరరావు, అంబటి శంకరరావు తెలిపారు.

రామాలయంలో అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న కరుణాకరరెడ్డి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట రెడ్డివీధి రామాలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇంచార్జ్ శిల్లా కరుణాకరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేట్ల ఎర్రయ్య, జగన్నాథ ఎల్లాజీ, సరగడ నాగిరెడ్డి, వంశీరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటండి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనానికి కృషి చేయనున్నట్టు సర్పంచ్ శిరుగుడి సంతోషి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, గ్రామపెద్దలతో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.సన్యాసినాయుడు, ఉపాధ్యాయుడు తమ్మిన పోతురాజు, ఉపసర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు, పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో కొట్టు కుపోతున్న యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడా రు. వివరాలివీ.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్ కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులందరూ సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో గౌరవ్ యాదవ్ కొట్టుకుని పోతుండగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, చిన్నప్పన్న గమనించారు. వెంటనే రంగంలోకి దిగి యువకుడిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

21 వాహనాల స్వాధీనం

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడిన సుమారు 21 మంది ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాలతో అంబేడ్కరు కూడలి వద్ద ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వీరి వాహనాలను వెంకటేశ్వరమెట్ట వద్ద పోలీస్ ఓపీకి తరలించారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- చంద్రనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం 89వ వార్డు చంద్రనగర్‌లోని 463 సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కులం, మతం పార్టీ ప్రాంతాలు అని చూడకుండా ప్రభుత్వ పథకాలు అందించారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పాలన తెచ్చారని తెలిపారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.4.69 కోట్లు అందించారని వివరించారు. భీమిలి నియోజకవర్గం ప్రాంతంలో రూ.17.15కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అంతేకాకుండా నూతనంగా కమూనిటీహాళ్లు, రోడ్లు డ్రైనేజీలు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు మరో రూ.15 కోట్ల వెచ్చించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నట్టు చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, నాయకులు ఆళ్ల పైడిరాజు, షేక్ రహమాన్, పొలమరశెట్టి విజయ్, ఏపీడీ శ్రీరామ్ ఏఈలు వెంకటలక్ష్మి, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల పోస్టర్‌ను శనివారం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీతమ్మధారలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇచ్చే కిట్లను పరిశీలించారు. తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ నెల 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు 50 రోజుల పాటు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ ఇలా ఐదు రకాలైన క్రీడా పోటీలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తారని చెప్పారు.

ఐఐఎంలో ముగిసిన వృద్ధి వర్క్‌షాపు



పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

ఆనందపురం: గంభీరంలోని ఐఐఎం క్యాంపస్‌లో శనివారం వార్షిక బిజినెస్ కాంక్లేవ్ వృద్ధి 5.0 వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఐఎంవీ ఫీల్డ్ సీఈవో గుహేష్ రామనాథన్ మాట్లాడుతూ ఆధునికీకరించిన దృఢమైన పాలన ద్వారా సవాళ్లను జయించి విజయాన్ని సాధించడాన్ని వివరించారు. ప్రఖ్యాత పారిశ్రామిక వేత్త, హౌస్ ఆఫ్ ఓంకార్ వ్యవస్థాపకురాలు పూనం కౌర్ కీలకమైన ఉపన్యాసం చేశారు. యు.ఎస్ ఆర్మీ స్థితిస్థాపక అభ్యాసం గురించి తెలియజేశారు. కోవిడ్ మహమ్మారి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన అంతరాయాలు వివరించారు. ఈ వర్క్‌షాపులో సీనియర్ అడ్మిన్ ఆఫీసర్ కలీం వీ ఖాన్, అసిస్టెంట్ మేనేజర్ సోమశేఖర్, అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ సీఈవో ఆశిష్ మహేశ్వరి, ఇండియా ఫైనాన్స్ డైరెక్టర్ శేషాద్రి సవాళ్లి, ఏంజెల్ ఇన్వెస్టర్ తరఫున అభిజిత్ పుగ్లియా, పాజిటివ్ వెబ్స్ కన్సల్టింగ్ శివాని మల్హోత్రా పాల్గొన్నారు.

మందుబాబులకు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

ఆనందపురం: మండలంలోని ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి శనివారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.విజయలక్ష్మి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించారు. కోర్టు పరిశరాలను శుభ్రం చేయించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున జరిమానా విధించారు.

కనుల పండువగా శివ పార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మధురవాడ: కార్తీక మాసం అందులో ద్వాదశిని పురస్కరించుకుని మధురవాడ స్వతంత్రనగర్ శ్రీ సాయి లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శివ పార్వతులు కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందు స్వామికి 108 కేజీల అన్నంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఇక్కడ 3 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణ మూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో పలువురు అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భారీ అంబలం పూజ

స్వతంత్రనగర్ సాయిబాబా ఆలయం సమీపంలో శనివారం సాయంత్రం అయ్యప్ప స్వామి భారీ అంబలం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వామి పూజా మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కేంద్ర పథకాలపై అవగాహన

ఆనందపురం: మండలంలోని ముచ్చర్లలో శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ కార్యదర్శి పడాల దుర్గాప్రసాద్ పీఎం సుకన్య సమృద్ధి యోజన గురించి తెలియజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కె.రామానాయుడు, కణమాం, ముచ్చర్ల సర్పంచ్‌లు ఆబోతు అప్పలరాము, షిణగం ఎర్రయ్య, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, పిల్లా చిన్నారావు పాల్గొన్నారు.

సందడే సందడి



నృత్యప్రదర్శనలో విద్యార్థులు

తగరపువలస: సంగివలస వరల్డ్ అమేయా స్కూల్‌లో శనివారం ఎస్సెన్స్-2023 పేరుతో వార్షికోత్సవం నిర్వహించారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులు రూపొందించిన గణితం, సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రెండున్నర గంటల పాటు దేశంలో విభిన్న జాతులు, ప్రపంచ సామాజిక అంశాలను ప్రతిబింబింపజేసే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విద్యార్థునుల నృత్యాలు, దేశభక్తిని పెంపొందించే స్కిట్‌లు అలరించాయి. విద్యార్థుల భాగస్వామ్యంతో ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ ప్రిన్సిపాల్ మండల తులసికి విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలు ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో జరిగాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పీఎం పాలెం: ప్రమాద వశాత్తూ పడిపోయి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పీఎం పాలెం సీఐ వై. రామకృష్ణ ప్రకారం.. పర్లాకిమిడి మండలం కాశీపేట బంజీరు గ్రామానికి చెందిన నిద్దెన కూర్మారావు (38) మరికవలసలో కుటుంబంతో నివసిస్తున్నాడు. దినసరి కూలిగా పని చేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన తన నివాసానికి ఎదురుగా ఉన్న రోడ్డుపై నడుస్తూ పడి పోవడంతో తలకు బలమైన గాయమైంది. కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య బుడ్డెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మునిగిన పంటల పరిశీలన

తగరపువలస: ఇటీవల తుపాను దాటికి ముంపునకు గురైన భీమిలి మండలం మజ్జిపేటలోని వరి పొలాలను శనివారం ఎంపీపీ దంతులూరి వాసురాజు తదితరులు పరిశీలించారు. రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడి పంట నష్టం గురించి ఆరా తీశారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, సచివాలయ కన్వీనర్ రాజగిరి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్‌బస్ వలంటీర్లకు సత్కారం

ఆనందపురం: మ్యాజిక్‌బస్ డే సందర్భంగా శనివారం ఆనందపురం సచివాలయంలో మూడు మండలాలకు చెందిన మ్యాజిక్‌బస్ వలంటీర్లను ఘనంగా సత్కరించి సర్టిఫికెట్లు అందించారు. సమాజంలో విద్యార్థులు, చిన్నారులకు క్రీడలు, విద్యాభివృద్ధికి మ్యాజిక్ బస్ వలంటీర్లు కృషి చేస్తున్నారని చందక లక్ష్మి తెలిపారు. ఎంపీటీపీ రమాదేవి, చందక సూరిబాబు, రెడ్డిబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవానికి ఏర్పాట్లు

పద్మనాభం: పద్మనాభంలో ఈ నెల 12వ తేదీన జరగనున్న అనంతుని దీపోత్సవం సందర్భంగా ఏర్పాట్లను సీఐ ఎస్.సన్యాసినాయుడు శనివారం పరిశీలించారు. గిరిపైన మెట్ల మార్గాన్ని, గిరిపైన ఆలయం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, గిరి దిగువున తోపులాటను నిలువరించడానికి బారికేడ్లు ఏర్పాటును పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

కాలుష్య సమస్యలకు పరిష్కారం వెతకాలి

కొమ్మాది: పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్య సమస్యలకు, ఇంధన అవసరాలకు పరిశోధకులు పరిష్కార మార్గాలు అన్వేషించాలని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీ భరత్ అన్నారు. గీతంలో జరుగుతున్న రసాయనిక శాస్త్రవేత్తల అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే హరిత సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు.

లోక్ అదాలత్‌లో 389 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి విజయలక్ష్మి

భీమునిపట్నం: భీమిలిలోని మూడు కోర్టుల్లో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 389 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎంపాలెం పోలిసుస్టేషన్ల పరిధిలోని కేసులు ఉన్నాయి. ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో, అలాగే రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి ఇన్‌చార్జి జడ్జిగాను పాల్గొనగా ఈ రెండు కోర్టుల్లోను 251 కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 138 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో నాలుగు స్టేషన్లకు సంబంధించిన పోలీసు అధికారులు, లోక్ అదాలత్ సభ్యులు ఎంవీ పార్వతీశం, డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.